
అడుగంటిన గొల్లపల్లి రిజర్వాయర్

నీటి మూటలే..!

వైసీపీ పాలనలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి
శంకుస్థాపనలతో సరి.. నిధుల్లేక అటకెక్కిన పనులు
ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైన హామీలు

పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

తమది రైతు ప్రభుత్వమనీ, ప్రాజెక్టులు కట్టి, ప్రతి ఎకరానికీ నీరిచ్చి, పొలాలను సస్యశ్యామలం చేస్తామన్న సీఎం జగన్ మాటలు నీటి మూటలయ్యాయి. అందుకు నిలువెత్తు నిదర్శనాలు ఆయన ఆవిష్కరించిన శిలాఫలకాలు, ముళ్ల కంపలతో నిండిపోయిన కాలువలు, ఎండిపోయిన చెరువులే. టీడీపీ హయాంలో చేపట్టిన పథకాలన్నింటినీ అటకెక్కించారు. వైసీపీ పాలనలో తలపెట్టిన పథకాలను కూడా మూలన పడేశారు. పైసా నిధులిచ్చింది లేదు, పనులు మొదలయ్యిందీ లేదు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌వన్నీ ఆర్భాటపు ప్రకటనలేనని జిల్లా ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

నిండు సభలో సీఎం చెప్పినా...

రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్) పథకం కింద దేవరకొండ, తోపుదుర్తి, ముట్టాల వద్ద రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఇందుకు రూ.803 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. రిజర్వాయర్ల పనులకు 2020 డిసెంబరు 9న ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ పద్ధతిన చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాపురం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి 5171 ఎకరాలు అవసరం అని అంచనా వేశారు. రిజర్వాయర్ల నిర్మాణం పూర్తి చేసి, రాప్తాడు నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ నీరిస్తామని గొప్పలు చెప్పారు. రెండేళ్లు దాటినా పనుల ఊసేలేదు. భూసేకరణ తక్షణమే చేపడతామని 2022 జూన్ 14న చెన్నేకొత్తపల్లిలో రైతు దినోత్సవ సభలో సీఎం ప్రకటించారు. నేటికీ ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు.

జిల్లేడుబండ నిలిపేశారు..

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లి తండా వద్ద 2.41 టీఎంసీల సామర్థ్యంతో జిల్లేడుబండ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ.680 కోట్ల అంచనా వ్యయంతో 2020 సెప్టెంబరు 22న కట్ట నిర్మాణ పనులు ప్రారంభించారు. 2.40 మీటర్ల వెడల్పు, 7.92 కిలోమీటర్ల పొడవుతో రిజర్వాయర్ కట్ట నిర్మాణం చేపట్టారు. 30శాతం పనులు చేశారు. బిల్లులు అందక గతేడాది నవంబరు నుంచి పనులు ఆగిపోయాయి. ప్రాజెక్టు నిర్మాణంతో ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల పరిధిలో 2500 ఎకరాలు ముంపుబారిన పడుతున్నా.. నిర్వాసితులకు పైసా పరిహారం ఇచ్చిన పాపాన పోలేదు. రైతులు ఆందోళనలు చేపట్టి విసిగిపోయారు. పరిహారం అదిగో ఇదిగో అంటూ ప్రభుత్వం కాలం వెల్లదీస్తోంది.

టీడీపీ మొదలు పెట్టిందని.. వదిలేశారు

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.591.57 కోట్లతో జీడిపల్లి జలాశయం నుంచి


మూడు రిజర్వాయర్ల నిర్మాణానికి సీఎం జగన్ వెంకటాంపల్లి వద్ద ఆవిష్కరించిన శిలాఫలకం

ఎగువ పెన్నార్ ప్రాజెక్టు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి జలాశయాలకు నీటి సరఫరా ఎత్తిపోతల పథకం పనులు 2018 ఆగస్టు ఒకటిన అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు మొదలెట్టారు. అప్పట్లో 37 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తి చేశారు. నాలుగు పంపుహౌస్‌లు నిర్మాణం మొదలు పెట్టారు. 16 కిలోమీటర్ల మేర పనులు మిగిలి ఉన్నాయి. అప్పట్లోనే 988 ఎకరాల భూమి సేకరించారు. వైసీపీ అధికారం చేపట్టాక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం పనులు చేపట్టాలన్న ఆలోచన కూడా చేయలేదు.

చెరువులు నింపుడు డ్రామా

పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో 193 చెరువులకు హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు నింపుతామని సీఎం ముఖ్యమంత్రితోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యే సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ, అధికారం చేపట్టాక పలు సభల్లో ఆర్భాటంగా ప్రకటించారు. 2021 జనవరిలో రాయలసీమ కరవు నివారణ పథకం కింద రూ.864.18 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబరులో సీఎంతో శంకుస్థాపన చేయించి, పనులు ప్రారంభించారు. 2022 డిసెంబరు నాటికి తొలివిడతగా పుట్టపర్తి బుక్కపట్నంలోని అన్ని చెరువులకు నీరు ఇస్తామని ప్రకటించారు. దానిని వాయిదా వేశారు. 2023 డిసెంబరు నాటికి నీరు ఇస్తామని మళ్లీ ప్రకటించారు. ఆ గడువు కూడా దాటిపోయింది. నీరు మాత్రం అందలేదు. మరోసారి జనాన్ని నమ్మించే ప్రయత్నంలో భాగంగా ఈ ఏడాది జనవరి 19న నల్లమాడ మండలం నల్లగొండ రిజర్వాయర్ పనులను పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శంకుస్థాపన చేసి, చెరువులను నింపేస్తున్నట్లు రైతు విజయ సంకల్పయాత్ర పేరుతో 9 రోజులు పాదయాత్ర నిర్వహించారు. పనులు చేపడుతున్నట్లు రైతులను నమ్మించేందుకు వెంగళమ్మచెరువు వద్ద కొన్ని పైపులు దించారు. పనులు మాత్రం మొదలు పెట్టలేదు.



నీళ్లేవీ?

టీడీపీ హయాంలో మడకశిర కాలువ నిర్మాణం చేపట్టి చెరువులకు నీరు ఇచ్చారు. బీడు భూముల్లో పంటలు పండించుకోవచ్చు అని సంబరపడ్డాం. గతేడాది అధిక వర్షాలతో చెరువులకు నీరు చేరింది. గతంలో సెప్టెంబరు, అక్టోబరులో కాలువలో నీరు పారేది. ఈ ఏడాది ఫిబ్రవరి దాటుతున్నా.. కాలువకు నీరు కాలేదు. రైతులు నీటి కోసం ఎదురుచూసే పరిస్థితి. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం కాలువ వెడల్పు కూడా చేయలేదు.

నరసింహప్ప, సీ కోడిగేపల్లి, మడకశిర మండలం




ఉత్తిమాటలే

రాప్తాడు నియోజకవర్గాన్ని కోనసీమగా మరుస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం జగన్‌తోపాటు ఎమ్మెల్యే నీటి ఎత్తిపోతల ద్వారా దేవరకొండ, తోపుదుర్తి, ముట్టాల రిజర్వాయర్ల నిర్మాణానికి మూడేళ్ల కిందట ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. నిధులివ్వకపోవడంతో భూసేకరణ కూడా చేయలేదు. నిధులు రాబట్టడంతో రాప్తాడు ఎమ్మెల్యే విఫలమయ్యారు. ఈ లెక్కన మూడు రిజర్వాయర్ల పనులు మూడు అడుగులు కూడా చేయలేదు.

- లింగన్న, సీపీఎం నాయకుడు, చెన్నేకొత్తపల్లి

కాలువల నిర్వహణ గాలికి..

హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి-కుప్పం, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉప కాలువ చాలా చోట్ల దెబ్బతిన్నాయి. పలుచోట్ల కాలువ గట్టు బలహీనంగా ఉంది. ఏటా గండ్లు పడుతూ నీరు ముందుకు కదలడం కష్టతరంగా మారింది. ఇరువైపులా ముళ్లపొదలతో నిండిపోయింది. కాలువ విస్తరణ పనులు చేపట్టకపోగా.. ముళ్ల పొదలతో కుంచించుకుపోయింది. ఈనేపథ్యంలో నీటి ప్రవాహ వేగం నెమ్మదిస్తోంది. లైనింగ్ పనులు చేపట్టని కారణంగా కాలువలో రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. మడకశిర ఉపకాలువ, జీడిపల్లి నుంచి కుప్పం వెళ్లే హంద్రీనీవా కాలువలకు మరమ్మతులు కరువయ్యాయి. నాలుగేళ్లు దాటినా హంద్రీనీవా కాలువ వెడల్పు, మరమ్మతులు, లైనింగ్ పనులకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారు.


ముళ్లపొదలతో నిండిన మడకశిర ఉపకాలువ



నిలిచిపోయిన జిల్లేడుబండ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులు

రిజర్వాయర్లను ఎండబెట్టి...

జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లను నింపకుండా ఎండబెట్టారు. కుప్పానికి కృష్ణా నీళ్ల తరలింపు పేరిట అధికార పార్టీ షో చేసింది. సీఎం జగన్ జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కుప్పం కాలువలో కొన్ని నెలలుగా నీరు పారిస్తున్నారు. సాధారణంగా జిల్లాలో సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో మడకశిర ఉప కాలువతోపాటు జీడీపల్లి-కుప్పం కాలువ కింద మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లతోపాటు చెరువులకు నీరు ఇవ్వాల్సి ఉంది. జీడిపల్లి నుంచి నీరంతా కుప్పం తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మడకశిర ఉపకాలువతోపాటు జీడిపల్లి-కుప్పం ప్రధాన కాలువల కింద చెరువులను ఎండబెట్టారని రైతులు ఆందోళన చెందుతున్నారు.


ఎండిపోయిన హరేసముద్రం చెరువు

ప్రతిపాదనలు మూలన పడేశారు...


మడకశిర ఉపకాలువ దుస్థితి

చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగు, సాగు నీరివ్వాలన్న సంకల్పంతో హంద్రీనీవా సుజల స్రవంతి మడకశిర ఉప కాలువ నిర్మాణానికి టీడీపీ హయాంలోనే శ్రీకారం చుట్టారు. దేమకేతపల్లి నుంచి 160 చెరువులకు ఎత్తిపోతల ద్వారా నీరిచ్చేందుకు రూ.510 కోట్లతో డీపీఆర్ కూడా సిద్ధం చేసి, సాంకేతిక అనుమతులకు ప్రతిపాదించారు. మడకశిర నియోజకవర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణం ప్రతిపాదనల దశ లోనే ఆగిపోయింది. నియోజకవర్గంలో తాగు, సాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి హంద్రీనీవా పథకం ద్వారా టీడీపీ హయాంలో రాళ్లపల్లి వద్ద, రత్నగిరి వద్ద రిజర్వాయర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. రాళ్లపల్లి రిజర్వాయర్‌కు డీపీఆర్ తయారీకి రూ.27 లక్షలు నిధులు కూడా మంజూరు చేశారు. రత్నగిరి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే చేసి, డీపీఆర్ తయారీకి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు. వైసీపీ అధికారంలోకి వచ్చి, ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ వాటి ప్రతిపాదనల దశ దాటలేదు. మూలనపడేశారు.

ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలి: ఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 28: ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని సాయి ఆరామంలో బుధవారం నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టే దిశగా జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. పాతనేరస్థులపై నిఘా పెంచాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేయాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేయాలన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్టు నమోదుచేయాలన్నారు. ఎన్నికల విధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను వెంటనే ఎస్‌హెచ్‌ఓలు పోలీసు స్టేషన్‌లో డిపాజిట్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ విష్ణు, డీఎస్పీలు వాసుదేవన్, కంజక్షన్, శ్రీనివాసులు, శ్రీలత, బాబ్జీ, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

పరీక్షల వేళ ఎడాపెడా కరెంటు కోతలు
మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 28: పరీక్షల సీజన్ మొదలవుతోంది. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. కీలకమైన తరుణంలో పట్టణంలో ఎడాపెడా కరెంటు కోతలు విధిస్తున్నారు. రోజులో 3, 4 సార్లు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. సాయంత్రం సమయంలో కోతలు విధిస్తున్నారు. నానెప్పనగర్, లక్ష్మీపురం, డిబి కాలనీ, డిఆర్ కాలనీ తదితర చోట్ల బుధవారం సాయంత్రం విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీనిపై ఆ శాఖ అధికారులను ప్రజలు అడిగితే 'మీ ప్రాంతంలో కరెంటు లేదా, మాకు తెలియదే, మెయిన్ లైన్ సప్లై ఆగిపోయి ఉంటుంది. త్వరగా వస్తుంద'ని చెబుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు విధించరాదని విద్యార్థులు కోరుతున్నారు. తమ పిల్లల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.


నానెప్పనగర్‌లో విద్యుత్ సరఫరా ఆపివేయడంతో అలుముకున్న చీకటి

సాయంత్రం 6 తరువాత కోతలు వద్దు

పరీక్షల సమయంలో విద్యుత్ కోతలు విధించరాదని ఏఈలు, ఏఈఈలకు తెలిపాం. ఎట్టి పరిస్థితుల్లోనూ డీఈ, డీఈఈలకు తెలియకుండా ఎల్‌సీలు తీసుకోకూడదని చెప్పాం. విద్యుత్ సరఫరా ఆగిపోతే శాఖ వెంటనే స్పందించి, పునరుద్ధరిస్తాం.

- భూపతి, ఈఈ

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 28: జాతీయ నిర్మాణ, నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ సంచాలకుడు శివరంగప్రసాద్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 16 నుంచి 35 ఏళ్ల వయసుగల ఎస్సీ నిరుద్యోగుల యువతీయువకులు అర్హులన్నారు. భూసర్వే, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. 10వ తరగతి, ఆపైన చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 9110550779, 9052901657 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రైతు భరోసా, సున్నా వడ్డీ నిధుల విడుదల

పుట్టపర్తి, ఫిబ్రవరి 28: రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాల కింద మూడో విడతలో జిల్లావ్యాప్తంగా 2,79,580 మంది రైతులకు రూ.55.94కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును స్థానిక కలెక్టరేట్‌లో ఆయన బుధవారం విడుదల చేశారు. సున్నా వడ్డీ పథకం కింద రుణాలు సక్రమంగా చెల్లించిన 1,08,260 మంది రైతులకు రూ.17.81 కోట్లు విడుదల చేశారన్నారు. అందుకు సంబంధించిన చెక్కును సైతం విడుదల చేశారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ భరత్, జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు, ఉద్యాన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

రాజకీయ పక్షాలు సహకరించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఫిబ్రవరి 28: జిల్లాలో అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామనీ, ఇందుకు రాజకీయ పక్షాలు సహకరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఓటరు నమోదు, ఎన్నికల అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన యువతీయువకులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ఓటర్లకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివారెడ్డి, మడకశిర ఎన్నికల అధికారి గౌరీశంకర్, టీడీపీ, కాంగ్రెస్, సీపీఎం, జనసేన, బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

టెట్ కేంద్రం తనిఖీ

కొత్తచెరువు, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రంలోని సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టెట్ (టీచర్స్ ఎంట్రెన్స్ టెస్టు) కేంద్రాన్ని బుధవారం కడప ఆర్జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. ఆర్జేడీ మాట్లాడుతూ.. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని డీఈఓ మీనాక్షికి సూచించారు.


టెట్ కేంద్రం వద్ద ఆర్జేడీ రాఘవరెడ్డి, డీఈఓ మీనాక్షి

ఇది పోలింగ్ కేంద్రమే..!


పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాల


కింద పడేందుకు సిద్ధంగా ఉన్న కిటికీ తలుపులు

కిటికీ తలుపులు ఊడిపోయాయి. పైకప్పు దెబ్బతింది. పెచ్చులు ఊడిపడుతున్నాయి. పడుతూనే ఉన్నాయి. గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో విద్యార్థులకు పాఠాలు చెప్పడం వీలుకాక బయట షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. అలాంటి పాఠశాలను ఏకంగా పోలింగ్ బూత్‌గా ఎంపిక చేశారు. కనీస సౌకర్యాలు లేకున్నా.. అన్నీ ఉన్నట్లు జిల్లా ఉన్నతాధికారులకు మండల యంత్రాంగం నివేదికలు పంపింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయి. రొద్దం మడలంలోని చిన్నకోడిపల్లిలో ఈ దుస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పోలింగ్ బూత్‌గా ఎంపిక చేశారు. 20వ నంబరు కూడా కేటాయించారు. అక్కడ సౌకర్యాలు మాత్రం దారుణంగా ఉన్నాయి.

అన్నీ ఉత్తమాటలే..

ప్రభుత్వం నాడు-నేడు కింద గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్య అందిస్తామని ప్రగల్భాలు పలుకుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నయనడానికి చిన్నకోడిపల్లి పాఠశాలే నిదర్శనం. పాఠశాలలో 5వ తరగతి వరకు 9 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రెండు తరగతి గదులు ఉన్నాయి. కిటికీలు, కరెంటు, నీటి సౌకర్యం లేకపోగా.. పాఠశాల పైకప్పు కారుతోంది. నాడు-నేడు కింద ఎంపికకాకపోగా.. మరమ్మతులకు ఐదేళ్లుగా నయాపైసా ఇవ్వకపోవడంతో పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యార్థులకు పాఠశాల బయట ఉన్న రేకుల షెడ్డులో పాఠాలు చెబుతున్నారు. ఇటీవల రూ.26 వేలు మరమ్మతుల కోసం ప్రభుత్వం విడుదల చేయగా.. అందులో రూ.13వేలు అన్నమయ్య జిల్లాలోని ఓ పాఠశాల కోసమని వెనక్కి తీసుకున్నారు. మిగిలిన రూ.13 వేలతో అరకొరగా మరమ్మతులు చేపట్టారు. రెండు తరగతి గదుల మరమ్మతుల కోసం సుమారు రూ.4 లక్షలు అవసరం ఉండగా.. రెవెన్యూ, విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇటీవలే చిన్నకోడిపల్లి పాఠశాలను 20వ పోలింగ్ బూత్‌గా గుర్తించారు. ఇందులో అన్ని సౌకర్యాలున్నట్లు తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖాధికారి.. జిల్లా ఉన్నతాధికారికి నివేదిక పంపడం శోచనీయం. కనీస సౌకర్యాలు లేని పాఠశాలలో ఎన్నికల విధులు ఎలా నిర్వహిస్తారో వారికే తెలియాలి.

-రొద్దం


పెచ్చులూడిన తరగతి గది పైకప్పు


మరమ్మతులు చేసిన తరగతి గది పైకప్పునకు నీరు పడుతూ..


రేకుల షెడ్డులో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయిని

అద్దె ఇవ్వలేదని సచివాలయానికి తాళం



సచివాలయానికి తాళం వేసిన దృశ్యం

బెళుగుప్ప, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని రెండో సచివాలయానికి భవన యజమాని బుధవారం తాళం వేశారు. అధికారులు 34 నెలల నుంచి అద్దె చెల్లించలేదని, అడిగినా పట్టించుకోవడం లేదని భవన యజమాని నాగమ్మ వాపోయారు. నెలకు రూ.7,712 ప్రకారం అద్దె బకాయి ఉన్నారని, నెల రోజుల క్రితం కూడా సచివాలయానికి తాళం వేశామని ఆమె అన్నారు. అప్పట్లో రూ.30 వేలు చెల్లించారని, మిగిలిన మొత్తాన్ని 20 రోజుల్లో చెల్లిస్తామని చెప్పి ఇంతవరకు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈవోఆర్డీ మాధవరెడ్డి వెళ్లి ఆమెతో మాట్లాడారు. వారం రోజుల్లోగా రూ.50 వేలు చెల్లిస్తామని నచ్చజెప్పడంతో ఆమె తాళం తెరిచారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కరెంటు కట్..!



కరెంటులేని అంగన్‌వాడీ కేంద్రం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 28: మండలకేంద్రంలోని ఈడిగబజారులోని అంగన్‌వాడీకేంద్రానికి కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో కరెంట్ కట్ చేశారు. మూడుసంవత్సరాలుగా కరెంటు లేకుండానే, కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. కేంద్రానికి రూ.20వేలు కరెంటు బకాయి బిల్లులున్నాయి. బకాయిలు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో, చిన్నారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది చిన్నారులను కరెంటు లేకపోవడంతో కేంద్రానికిపంపలేదని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. కరెంటు బిల్లుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, బిల్లులు వస్తాయని చెబుతున్నారని, వచ్చిన వెంటనే బిల్లులు చెల్లించి, సరఫరా తీసుకుంటామంటామని అంగన్‌వాడీ కార్యకర్త చెబుతున్నారు.

రైతు భరోసా విడుదల

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 28: రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల కింద మూడో విడతలో జిల్లాలో 2,94,353 మంది రైతులకు రూ50.01 కోట్ల వి డుదలైనట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి సీఎం ఈ సొమ్మును విడుదల చేశారన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ఒక్కొక్క రైతుకు రూ.2 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. అలాగే 2021-22 ఖరీఫ్‌కు సంబంధించి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 83,534 మంది రైతులకు రూ17.25 కోట్లు లబ్ధి చేరిందన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ, ఎంఏ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 28: ఎస్కేయూ ఆధ్వర్యంలో గురువారం నుంచి పీజీ, ఎంఏ విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ బుధవారం ప్రకటనలో తెలిపారు. బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ, గణితం, రూరల్ డెవలప్‌మెంట్, పొలిటికల్ సైన్స్ తెలుగు, ఇంగ్లీష్ విభాగాల విద్యార్థులు కొంతమంది టెట్ రాస్తున్నారని, వారికి టెట్ తరువాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

టెట్‌కు 235 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: జిల్లాలో రెండో రోజైన బుధవారం టెట్ పరీక్షలకు 235 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని విద్యాశాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా సాగినట్లు తెలిపారు.

2, 3తేదీల్లో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

అత్యాధునిక వాహనం హిందూపురానికి రాక

టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

హిందూపురం, ఫిబ్రవరి 28: పట్టణంలో మార్చి 2, 3 తేదీల్లో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి ఇటీవలే క్యాన్సర్ నిర్ధారణ చేసే అత్యాధునిక వాహనం తెప్పించారన్నారు. రెండు రోజులపాటు ఆ వాహనాన్ని నియోజకవర్గ ప్రజల కోసం తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇటీవల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల వద్దకు వచ్చిన రోగులకు క్యాన్సర్ అని అనుమానం వచ్చి ఉంటే వారిని హిందూపురానికి పంపాలని కోరారు. ఈ వాహనంలో చేసే పరీక్షలు చాలా ఖర్చుతో కూడుకున్నవని అయినా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వసుంధరదేవి ఇక్కడికి పంపుతున్నట్లు తెలిపారు.

చెన్నకేశవులుకు ఘన నివాళి

రామగిరి, ఫిబ్రవరి 28: కుంటిమద్ది మాజీ సర్పంచ్, రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీనారాయణ సోదరుడు కొడిదల చెన్నకేశవులు ఘాట్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, శ్రేయోభిలాషులు ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. చెన్నకేశవులు అలంకరించిన పదవులు, చేసిన ప్రజాసేవను గుర్తు చేసుకున్నారు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.



చెన్నకేశవులు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

ఒకరి అరెస్టుతో సరి..!

శ్రీకృష్ణపై దాడి కేసును పట్టించుకోని పోలీసులు

పది రోజులు గడిచినా పురోగతి లేదు.. అరెస్టులు లేవు

ప్రత్యేక బృందాల ఏర్పాటు ఉత్తిదే అని అనుమానాలు

విపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేసినా స్పందన కరువు

మిద్దె ఎర్రిస్వామి బెయిల్ కోసం వైసీపీ లీగల్ సెల్ ప్రయత్నాలు

మిగిలినవారి ముందస్తు బెయిల్‌కు పోలీసుల సహకారం..?



అశోక్



బండి రవి

అనంతపురం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అది దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన సంఘటన. అమానవీయ ఘటన. భావ ప్రకటన స్వేచ్ఛపై వైసీపీ మూకలు చేసిన మూకుమ్మడి దాడి అది. పదిరోజుల క్రితం రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు క్రూరంగా దాడికి పాల్పడ్డాయి. విచక్షణ కోల్పోయి హత్యాయత్నానికి ఒడిగట్టారు. శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానవీయమని పోలీసు యంత్రాంగం సైతం పేర్కొంది. ఆ మేరకు దుండగులపై కేసు నమోదు చేశారు. దాడిచేసినవారి ఫొటోలు, వివరాల సహా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించింది. ఫొటోలు, వివరాలు బహిర్గతం కాగానే పోలీసులు స్పందించారు. హుటాహుటిన నిందితుల్లో ఒకరైన మిద్దె ఎర్రిస్వామిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి నిందితుడికి రిమాండ్ విధించారు. ఆ తరువాత పోలీసు యంత్రాంగం పట్టించుకోవడం మానేసింది. మిగిలినవారిని అరెస్టు చేయడంపై శ్రద్ధ పెట్టడంలేదన్నది నిర్వివాదాంశం.

క్రూరమైన దాడిపై స్పందన ఇదేనా..?

శ్రీకృష్ణపై దాడి కేసు దర్యాప్తును పోలీసు యంత్రాంగం జాప్యం చేస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అన్ని వర్గాల ప్రజల్లోనూ ఇదే చర్చ జరుగుతోంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడింది ఎవరో వీడియోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. అయినా పోలీసులు ఒకరి అరెస్టుతోనే సరిపెట్టారు. దాడికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసు యంత్రాంగం చెబుతోందేగాని.. చేతల్లో చూపడం లేదన్న విమర్శలను ఎదుర్కొంటోంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారు అధికార పార్టీ నేతల అనుచరులు అయినందుకే అరెస్టు చేయడం లేదన్న సందేహాలు ప్రతి ఒక్కరి మదిలోనూ మెదులుతున్నాయి. అధికార పార్టీ ముఖ్యుల ఒత్తిళ్ల నేపథ్యంలోనే జిల్లా పోలీసు యంత్రాంగం నిందితులను అరెస్టు చేసేందుకు సాహసించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించామని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటించింది. ఆ బృందాలు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పదిరోజులుగా ఒక్కరినీ అరెస్టు చేయకపోవడంతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారా..? లేదా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారు వైసీపీ ముఖ్య నాయకుల రక్షణలోనే ఉన్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. 'మా నాయకుల చెంతన ఉన్నాం. మమ్మల్ని ఎవరు అరెస్టు చేసేది..?' అని స్థానికులతో నిందితులు అంటున్నారు. అహంకార ధోరణిని ప్రదర్శిస్తున్నారు. పోలీసులకు సవాలు విసురుతున్నారు. వైసీపీ మూకల క్రూరమైన దాడి పట్ల పోలీసుల స్పందన ఇదేనా..? అని సామాన్య ప్రజలు సైతం విస్తుపోతున్నారు. అధికార పార్టీ ముఖ్యుల ఒత్తిళ్లకు తలొగ్గి, నిందితులకు ముందస్తు బెయిల్‌కు అనువుగా ఉండేలా పోలీసులు అరెస్టు చేయడకుండా ఉన్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

నిరసన గళమెత్తినా..

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిని ప్రజాస్వామికవాదులు, వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా, కుల, విద్యార్థి, యువజన సంఘాలు ముక్తకంఠంతో ఖండించాయి. దుండగులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని నినదించాయి. జర్నలిస్టులు సైతం ఈ దాడిని ఖండిస్తూ పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు నిర్వహించారు. ప్రజాస్వామిక సంఘాలు చర్చలు నిర్వహించాయి. ఎవరు ఎన్నిరకాలుగా ప్రయత్నాలు చేసినా పోలీసులు ఈ కేసును పట్టించుకోవడంలేదు. పోలీసు యంత్రాంగం అన్ని వర్గాల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. జిల్లా పోలీసు యంత్రాంగం మెతక వైఖరిని ప్రదర్శించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని మేధావివర్గాలు అంటున్నాయి. పోలీసులే బదులివ్వాలని ఆ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.





దాడిచేస్తున్న వైసీపీ రౌడీమూకలు

బెయిల్ కోసం రంగంలోకి వైసీపీ లీగల్ వింగ్

శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన వైసీపీ మూకల్లో ఒకరైన మిద్దె ఎర్రిస్వామిని పోలీసులు సంఘటన జరిగిన మరుసటిరోజే అరెస్టు చేశారు. ఆ మరునాడే కోర్టులో హాజరుపరిచారు. అదే సమయంలో నిందితుడి తరుఫున అధికార పార్టీ లీగల్ వింగ్ రంగంలోకి దిగింది. రిమాండ్ రిజెక్ట్ పిటిషన్‌ను కోర్టుకు సమర్పించింది. అయితే న్యాయాధికారి ఆ పిటీషన్‌ను తిరస్కరించారు. మార్చి 6 వరకూ రిమాండ్ విధించారు. జిల్లా జైలుకు తరలించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా మిద్దె ఎర్రిస్వామిని బెయిల్‌పై బయటకు తీసుకొచ్చేందుకు అధికార పార్టీ లీగల్ వింగ్ సన్నద్ధమైంది. బెయిల్ పిటిషన్ తయారు చేసే పనిలో నిమగ్నమైంది. శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారిలో ఆరుగురిని పోలీసులు గుర్తించారు. ఆ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ లెక్కన మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేయాల్సి ఉంది. కానీ పట్టించుకోవడం లేదు. మిద్దె ఎర్రిస్వామికి బెయిల్ ఇప్పించే ప్రయత్నాలు జరుగుతుండటంతో.. మిగిలినవారి అరెస్టు ఉంటుందా..? లేదా..? అనే సందేహాలు కలుగుతున్నాయి. వారందరూ ముందస్తు బెయిల్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. నిందితులను అరెస్టుచేసి పోలీసులు తమపై వస్తున్న విమర్శలకు బదులు చెప్పుకుంటారా..? అరెస్టు చేయకుండా సహకరిస్తారా తేలాల్సి ఉంది.

ఫైటింగ్‌కు సిద్ధం..!

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

అమలుగాని తీర్మానాలు, అటకెక్కిన ప్రతిపాదనలు

కాకమీదున్న అధికార పార్టీ జడ్పీటీసీలు ఇతర సభ్యులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: 'మేము చేసిన తీర్మానాలు అమలు కావడం లేదు. ప్రజల కోసం అడిగిన పనుల ప్రతిపాదనలు పేపర్లకు పరిమితమయ్యాయి. ప్రొటోకాల్, గౌరవం దక్కడం లేదు..' ఇలా.. అనే అంశాలపై తీవ్ర అసహనంతో ఉన్న జడ్పీటీసీలు, ఇతర పాలకవర్గ సభ్యులు గళం విప్పడానికి సిద్ధమయ్యారు. జడ్పీలో గురువారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశం దీనికి వేదిక కానుంది. జడ్పీలో ఉన్నతాధికారులు తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని పలువురు జడ్పీటీసీలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. తమను గంటల తరబడి బయట కూర్చొబెట్టి పంపుతున్నారని ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తాగునీటి సమస్యలు, అభివృద్ధి పనులు గురించి నాలుగు నెలల క్రితం ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ఫైళ్లకు చెదలు పడుతున్నాయన్న ఆవేదనతో ఉన్నారు. ఇటీవల జడ్పీ సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు కూడా అమలు కావడం లేదని వాపోతున్నారు. రెండేళ్లుగా తాము ఏ పనులూ చేసుకోలేదని, ఇప్పుడైనా చేసుకుందామని అనుకుంటే ఉన్నతాధికారులు సహకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారం తమదే అయినా ఏమీ చేసుకోలేని దుస్థితిలో ఉన్నామని అంటున్నారు. మార్చిలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడం ఖాయం. ప్రభుత్వం మారితే తమ పరిస్థితి ఏమిటి అని పలువురు జడ్పీటీసీలు ఆందోళనలో ఉన్నారు. అందుకే, ఈ సమావేశం చాలా కీలకమని భావిస్తున్నారు. తమ సమస్యలకు పరిష్కారం, ప్రశ్నలకు సమాధానాలు రాకుంటే తామేమిటో చూపిస్తామని చాలా మంది అధికార పార్టీ జడ్పీటీసీలు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల నడుమ గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఏం జరుగుతుందో అన్న చర్చ నడుస్తోంది.

సొంత డబ్బుతో బోర్లకు మరమ్మతులు

వచ్చే ఎన్నికల్లో విజయం నాదే

తాడిమర్రి నుంచే ప్రచారం మొదలు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, ఫిబ్రవరి 28: నియోజకవర్గంలో చాలా బోర్లు, తాగునీటి పథకాల మోటార్లు కాలిపోయాయనీ, వాటికి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించినట్లు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావంతో నియోజకవర్గంలో భూగర్భజలాలు అడుగంటిపోయి, తాగునీటి బోర్లు ఎండిపోయాయన్నారు. వేసవి కావడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై ఇటీవల జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి విన్నవించామన్నారు. కలెక్టర్ కొంతమేర స్పందించి తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించారన్నారు. కాలిపోయిన బోర్లు, మంచినీటి పథకాల మోటార్లకు సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించానన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజలకు తాగునీరు అందించేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ బావులకు కనీసం ఐదారు గంటలు కూడా నాణ్యమైన కరెంటు సరఫరా చేయకపోవడంతో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. లో ఓల్టేజీ కారణంగా వందల సంఖ్యలో విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని సీఎం జగన్ గొప్పలు చెప్పి, రైతులను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో సైకో పాలన సాగుతుండగా.. ధర్మవరం నియోజకవర్గంలో పాలేగాళ్ల రాజ్యం నడుస్తోందని ఆయన విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాఫియాను ఏర్పాటు చేసుకుని, రూ.4వేల కోట్లు అక్రమంగా అర్జించాడని ఆరోపించారు. రూ.కోట్లు విలువ చేసే భూములను బెదిరించి, తక్కువ ధరకే లాక్కొన్నాడని ధ్వజమెత్తారు. రానున్న ఎన్నికల్లో కేతిరెడ్డి ఓట్లు అడిగేందుకు వెళితే గుడ్డలూడదీసి తరిమికొడతారన్నారు. ధర్మవరం అసెంబ్లీ స్థానం నుంచి తాను పోటీ చేస్తాననీ, లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆ పాచికలేవీ పారవని స్పష్టం చేశారు. వచ్చేనెల మొదటి వారంలో తాడిమర్రి మండలం నుంచి ప్రచారం ప్రారంభిస్తానన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు డిష్‌రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, బోడగల గిరిధర్, దుస్సాక్రిష్ణ, గొట్లూరు చంద్ర, నబీరసూల్, నారాయణస్వామి యాదవ్, చిలకం సూర్యనారాయణరెడ్డి, సరితాల దస్తగిరి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

24 పోస్టులు... 1764 దరఖాస్తులు

అనంతపురం సిటీ, ఫిబ్రవరి 28: రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, ఆఫీస్ సబార్డినేట్, శానిటరీ వర్కర్స్ ఉద్యోగాలకు సంబంధించి 24 పోస్టులకు 1764 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆ శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి త్వరలోనే మెరిట్ జాబితాను ప్రకటిస్తామని, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వాటిని భర్తీ చేస్తామని అన్నారు.

అక్రమాల యోగాసనం

- బుద్ధ యోగా ఫౌండేషన్ దందా
- రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, వలంటీర్ల నియామకం
- మధ్యవర్తులతో లక్షల్లో ముడుపుల వసూళ్లు
- ఆయుష్ శాఖ పేరిట నియామక ఉత్తర్వులు
- పాఠశాల విద్యాశాఖ నుంచి ప్రొసీడింగ్స్
- 2021 నుంచి 13 విడతలుగా పోస్టుల భర్తీ
- 1500 మందికి పైగా బాధితులు
- రూ.50 కోట్ల కుంభకోణం?
- కడపలో కలెక్టర్, ఎస్పీకి కొందరి ఫిర్యాదు
- తెరవెనుక వైసీపీ పెద్దలు!

అనంతపురం విద్య, ఫిబ్రవరి 28: రాష్ట్ర విద్యాశాఖలో రూ.కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్ల ఉద్యోగాల పేరిట ఒక్కో అభ్యర్థి నుంచి రూ.లక్షలు గుంజుకున్నారు. ఈ దందాను 2021లో మొదలు పెట్టారు. బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా పోస్టులు భర్తీ చేసి.. రూ.కోట్లు కొల్లగొట్టారని సమాచారం. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షలు, రూ.3.30 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా అందినకాడికి వందల మంది నుంచి వసూలు చేశారు. అనంతరం వీరిని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో యోగా ఇన్‌స్ట్రక్టర్లు, యోగా వలంటీర్లుగా నియమించారు. ఇన్‌స్ట్రక్టర్లకు రూ.25 వేలు, వలంటీర్లకు రూ.15 వేలు జీతం ఇస్తామని చెప్పడంతో నిరుద్యోగులు క్యూకట్టారు. అడిగినంత లంచాన్ని మధ్యవర్తులకు ముట్టజెప్పారు. ఇలా ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇచ్చారు. ఉద్యోగం వచ్చిందని ఆశగా స్కూళ్లలో చేరిన వారికి నెలల తరబడి జీతాలు లేవు. దీంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పలు ప్రాంతాల్లో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. కడప జిల్లాలో కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతపురం జిల్లాలోనూ ఈ తరహా కేసులు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు ఈ స్కాం జరిగినట్లు తెలిసింది. ఈ స్కాం సహా బుద్ధ యోగా ఫౌండేషన్ వెనుక అధికార పార్టీ కీలక నేతలు ఉన్నారని సమాచారం.

విడతల వారీగా ఉద్యోగాలు

రాష్ట్ర వ్యాప్తంగా బుద్ధా యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నిరుద్యోగులకు వల వేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగాలు ఇస్తున్నామని నమ్మించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి అనుమతి ఉన్నట్లు నమ్మించారు. దీంతో అనంతపురం, కదిరి, పుట్టపర్తి, కడప ప్రాంతాలకు చెందిన వందల మంది నిరుద్యోగులు ఈ ఉద్యోగాల కోసం తరలి వచ్చారు. చాలా మంది నిరుద్యోగులు 2022, 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో బ్రోకర్లకు లక్షల రూపాయలు చెల్లించారు. వీరికి 2023 జూన్, జూలైలో నియామక పత్రాలు ఇచ్చారు. కానీ, 2021 నుంచే విడతలవారీగా నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 13 విడతల్లో ఈ పోస్టులను భర్తీ చేశారని బాధిత టీచర్లు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా 13వ బ్యాచ్‌లో 13 బ్యాచ్-ఏ, బ్యాచ్-బీ, బ్యాచ్-సీ, బ్యాచ్-డీ పేరుతో కూడా నియామకాలు చేపట్టి.. అందినకాడికి డబ్బులు లాగినట్లు సమాచారం. ఈ పోస్టులకు సంబంధించి 13వ బ్యాచ్ చివరిదని చెప్పి.. 13వ బ్యాచ్ కింద నాలుగు విడతల్లో నిరుద్యోగుల నుంచి డబ్బులు గుంజినట్లు తెలుస్తోంది. మొదట్లో ఉద్యోగాల్లో చేరిన వారికి 4 నెలలు, 6 నెలలు జీతాలు చెల్లించారు. ఆ తర్వాత పైసా కూడా ఇవ్వలేదు. 2023, జూన్ 26న నియమితులైన 12వ బ్యాచ్ వాళ్లకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు.

రూ.50 కోట్ల పైమాటే...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సుమారు 300 మంది ఉద్యోగాల్లో చేరారు. కడప జిల్లాలో 74 మంది ఉన్నారని బాధితులు చెబుతున్నారు. కడపకు చెందిన ఓ మహిళ రూ.3 లక్షలకు పైగా చెల్లించారు. 2023, జనవరి 3వ వారంలో ఆమె మధ్యవర్తికి డబ్బు చెల్లించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. కానీ, ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా జీతం ఇవ్వలేదు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ మహిళ 2023, ఫిబ్రవరిలో రూ.2 లక్షలు చెల్లించారు. అదే ఏడాది జూన్‌లో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఏడు నెలలు గడిచినా జీతం చెల్లించలేదు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువకుడు రూ.2 లక్షలు చెల్లించాడు. 2022 జూలైలో అతనికి పోస్టింగ్ ఇచ్చారు. కానీ జీతం చెల్లించలేదు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1500 మంది వరకు బాధితులు ఉన్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా ఈ కుంభకోణం నడిచినట్లు తెలుస్తోంది.



బుద్ధ యోగా ఫౌండేషన్ పేరిట ఇచ్చిన ఐడీ కార్డులు

అంతా మాయ..

బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట జరిగిన తతంగం మొత్తం ఓ మాయలా కనిపిస్తోంది. 2022 జూలైలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరిట ప్రొసీడింగ్స్ వచ్చాయి. యోగా ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లో చేర్చుకోవాలని, ప్రత్యేక హాజరు నమోదు చేయాలని సూచించారు. యోగా శిక్షణ ఉచితంగానే ఇస్తారని పేర్కొన్నారు. వీరి భర్తీ ప్రక్రియను మొత్తం బుద్ధ యోగా ఫౌండేషన్‌వారే చూసుకున్నారు. పోస్టుల భర్తీ వ్యవహారాన్ని బహిరంగపరచకుండా, లోలోపలే తతంగం నడిపించారు. గుంటూరులోని బ్రాడిపేటలో దీని కార్యాలయం ఉందని, 45 రోజుల శిక్షణ కోసం తమను అక్కడికి పిలిపించి, 60 రోజులు అక్కడే ఉంచారని బాధితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే విడతలవారీగా లంచం చెల్లింపులు జరిగాయి. కొందరు ఫోన్ పే, మరికొందరు నగదు రూపంలో డబ్బులు చెల్లించామని చెబుతున్నారు. వీరందరికీ గవర్నమెంట్ ఆఫ్ ఏపీ, బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరిట ఐడీ కార్డులు ఇచ్చారు. ఆయుష్ శాఖ కమిషనర్ పేరిట నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఇదిలావుంటే, జిల్లాల విద్యాశాఖ అధికారులకు వీరి నియామకంపై సమాచారమే లేదని తెలిసింది. కొందరు ఎంఈఓలకు మాత్రం మౌఖికంగా తెలుసునని సమాచారం.

బుద్ధ యోగా పేరిట..

ఉద్యోగాల భర్తీ అంతా బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ పేరుతో నడిచినట్లు స్పష్టమవుతోంది. ఈ ఫౌండేషన్ వెనుక వైసీపీ నాయకులు, పెద్ద తలకాయలే ఉన్నట్లు సమాచారం. పోలీసులు తీగ లాగితే ఈ కుంభకోణం డొంక కదులుతుందని బాధితులు చెబుతున్నారు. అయితే, అధికార పార్టీ పెద్దల హస్తం ఉందని తెలుస్తుండడంతో పోలీసులు చొరవ చూపడం అనుమానమేనని అంటున్నారు.



23 వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

తెలుగుదేశాన్ని గెలిపించండి..

● ఇంటింటి ప్రచారంలో కందికుంట యశోదమ్మ

కదిరి, ఫిబ్రవరి 28: రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలిపించాలని టీడీపీ ఇన్‌చార్జీ కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదమ్మ బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. పట్టణంలోని 23 వార్డులో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సైకిల్‌గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. మహిళలు ఆమెకు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఆమెతోపాటు ఫర్వీనాభాను, కౌన్సిలర్ సావిత్రమ్మ, డైమండ్ ఇర్షాన్, ఇనాయత్, సౌకత్, అహమ్మద్‌అలీ, బాబ్‌జాన్, ఇస్మాయిల్, నాసిర్, లియాకత్, కాటం మనోజ్, ఖతబ్, సులేమాన్, మన్సూర్, పవన్, జున్నైయత్, గంగరత్నమ్మ, రమణమ్మ, ఉమాదేవి, ప్రేమలత, ఫరీదా తదితరులున్నారు.

తుక్కు రేపుతారనేనా?

● కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు ● నిలదీత భయమేనా..?



కదిరి మున్సిపల్ కార్యాలయం

కదిరి, ఫిబ్రవరి 28: మున్సిపాలిటీలో కౌన్సిలర్లు తమ వార్డు సమస్యలు చెప్పుకోవడానికి, అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడానికి ప్రతినెలా చివరి వారంలో కౌన్సిల్‌మీట్ నిర్వహిస్తారు. అయితే ఈనెల కౌన్సిల్‌మీట్ నిర్వహించడంలేదని కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు కారణాలు తెలియరాలేదు. ప్రతినెలా కౌన్సిల్ మీట్ నిర్వహించడం వలన వార్డుల్లో సమస్యలు కౌన్సిలర్లు ఛైర్మన్ దృష్టికి తీసుకురావడానికి, ప్రజాసమస్యలు చర్చించడానికి అవకాశముండేంది. దీంతోపాటు మున్సిపాలిటీలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కూడా కౌన్సిల్‌మీట్‌లో ఆమోదం ఇస్తారు. మోజార్టీ కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ఇది కొనసాగుతోంది. ఈనెల నిర్వహించకపోవడంతో పలువురు కౌన్సిలర్లు అనేక అనుమానులు వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిల్ మీట్ నిర్వహించకపోవడానికి కమిషనర్ ఎటువంటి కారణాలు తెలపలేదు. తుక్కు చేస్తారని, ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'తుక్కు దొంగలు' పేరుతోట కథనం ప్రచురితమైంది. దానిపై కౌన్సిల్‌లో పెద్ద దుమారమే లేస్తున్నట్లు సమాచారం. పలువురు కౌన్సిలర్లు కమిషనర్‌ను తుక్కుదొంగలెవరో తెల్చాలని పట్టుపట్టిన విషయం తెలిసిందే. కమిషనర్ కూడా ఈ తుక్కు దొంగలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్‌కు హామీ ఇచ్చినట్లు తెలిసింది. కౌన్సిల్ సమావేశం నిర్వహించకపోవడానికి ఈ తుక్కు కారణమని సమాచారం. కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తే అందులో మోజార్టీ సభ్యులు నిలదీస్తారన్న అనుమానంతోనే సమావేశం నిర్వహించలేదని పలువురు కౌన్సిలర్లు చెబుతున్నారు. బుధవారం ఇదే విషయంపై ఓఅధికారి, ఓరాజకీయ నాయకుడి మధ్య వాగ్వివాదం జరిగినట్లు సమాచారం. మొత్తం మీద తుక్కు చేస్తారనే కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని పలువురు కౌన్సిలర్లు చెప్పడం గమనార్హం.



పరిటాల జ్ఞానతో తెలుగుమహిళలు

నేడు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

ధర్మవరం, ఫిబ్రవరి 28: పట్టణంలోని శివానగర్‌లోని శివాలయంలో గురువారం ఉదయం 7గంటలకు బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నారు. తెలుగుమహిళలతో కలిసి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ సతీమణి పరిటాలజ్ఞాన ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలుగుమహిళలు తెలిపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పరిటాలజ్ఞాన తెలుగుమహిళలతో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాబుష్యూరిటీభవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, ధర్మవరం నియోజకవర్గంలో పరిటాలశ్రీరామ్ లను గెలిపించే విధంగా మహిళలందరూ కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించాలన్నారు. అనంతరం టీడీపీ కండువాలు, పసుపుకలర్ టోపీలను పరిటాల జ్ఞాన తెలుగు మహిళలకు అందజేశారు. ధర్మవరం బరిలో నిలిచేది పరిటాల శ్రీరామే అని తెలుగు మహిళలు వ్యాఖ్యానించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

బత్తలపల్లి, ఫిబ్రవరి28: రెండు ద్విచక్ర వామనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వేల్పుమడుగు క్రాస్ సమీపంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లిలోని తహసీల్దార్ కార్యలయం వద్ద గూడారాలలో నివాసం ఉంటున్న గంగప్ప స్టీల్ సామాన్ల వ్యాపారం చేసేవారు. రోజూలాగే బత్తలపల్లి నుంచి ధర్మవరం వెళ్లి వ్యాపారం చేసుకొని తిరిగి వస్తుండగా వేల్పుమడుగు క్రాస్ సమీపములోకి రాగానే.ఎస్‌కే యనివర్శిటికి చేందిన ఆదేప్ప ఎదురుగా వస్తున్న గంగప్ప వాహనాన్ని ఢీ కొన్నాడు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. గంగప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ తిరుపాలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం: యువకుడికి గాయాలు

తాడిమర్రి, ఫిబ్రవరి 28: స్థానిక ప్రభుత్వ పాఠశాల ఎదురుగా బొలెరో వాహనం.. బైక్‌ను ఢీకొనడంతో రవితేజ అనే యువకుడికి తీవ్రగాయలయ్యాయి. పోలీసులు తెలిపినవివరాల మేరకు బత్తలపల్లికి చెందిన రవితేజ ద్విచక్రవాహనంలో వాసాపురంకు వెళ్తుండగా పార్నపల్లి నుంచి హుబ్లీకి అరటికాయలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రవితేజ గాయపడి అక్కడే పడిపోగా స్థానికులు వైద్యచికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తాడిమర్రిపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, ఫిబ్రవరి 28: పట్టణంలోని శివానగర్‌కు చెందిన వెంకటరాముడు బుధవారం పురుగులమందు తాగి ఆత్మ హత్యాయత్నం చేశారు. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శివానగర్‌కు చెందిన వెంకటరాముడు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే వెంకటరాముడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూతీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో బుధవారం తిక్కస్వామి గుడి సమీపంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వెంకటరాముడు కుటుంబసభ్యులకు సమాచారం అందించి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

3న ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి28: పట్టణంలోని యువర్స్‌ఫౌండేషన్ నేత్రాలయ ఐ క్లినిక్ సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి కడప ఆధ్వర్యంలో వచ్చేనెల 3వతేదిన ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఉచిత కంటివైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువర్స్‌ఫౌండేషన్ ప్రెసిడెంట్ శీలానాగేంద్ర తెలిపారు. ఈమేరకు బుధవారం యువర్స్‌ఫౌండేషన్ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. కంటిచూపు మందగించిన వారు ఈ శిబిరానికి వచ్చి చికిత్స చేయించుకోవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకుపాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కంటి అపరేషన్‌కు ఎంపికైన వారిని క్యాంపు రోజే హాస్పిటల్‌కు తీసుకెళ్లి అపరేషన్ చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు ఆచారి, జయరాం, బండినాగేంద్ర, శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు 'పల్లె' ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28: పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పరామర్శించారు. మండలంలోని తంగేడుకుంట, ఓడీచెరువు గ్రామాల్లో బుధవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించారు. బెంగుళూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తంగేడుకుంటకు చెందిన క్రిష్టయ్య కుమారై ఆరేళ్ల చిన్నారి యమున మృతి చెందింది. కుటుంబ సభ్యులను పరామర్శించిన పల్లె వారికి ఆర్థిక సాయం అందజేశారు. మండలకేంద్రంలో అనారోగ్యంతో మంచాన పడిన రజియాబీని పరామర్శించి తమవంతు ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, బీసీసెల్ డ్రిప్ నాగరాజు, శ్రీనివాసులు, ఎన్ఎస్ వెంకటేష్, చవిటి క్రిష్ట, చికెన్ అంజి, కె. క్రిష్టమాజీ ఎంపీటీసీ క్రిష్టప్ప, వెంకటనారాయణ, జిల్లా మైనార్టీ మండోజీ ఆర్ఫీఖాన్, చికెన్‌షానూ, షబ్బీర్, తుమ్మల మహబూబ్‌బాషా, సౌదీ నాగరాజు తదితరులున్నారు.

వీఆర్‌ఓకు నివాళి

అనారోగ్యంతో మృతి చెందిన ఓడీసీ-2 వీఆర్ఓ శివప్ప(42) భౌతిక కాయాన్ని సందర్శించి పల్లె రఘునాథ్ రెడ్డి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందించారు. తహసీల్దార్ ఖాజాబీ, డిప్యూటీ తహసీల్దార్ జాకీర్, ఆర్ఐ నాగేంద్ర, వీఆర్‌ఓలు గ్రామానికెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమారై ఉన్నారు.



ఓడీసీలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందచేస్తున్న మాజీ మంత్రి పల్లె

నల్లమాడ : మండలంలోని కుటాలపల్లి గ్రామానికి చెందిన చాకలి తిరుపాల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి బుధవారం గ్రామాన్ని సందర్శించి, తిరుపాల్ నివాసానికెళ్లి అతన్ని పరామర్శించారు. వైద్య చికిత్సల నిమిత్తం రూ. ఐదువేలు ఆర్థికసాయం అందించారు. గన్‌రెడ్డి, గుండ్ర శివారెడ్డి, బుట్టినాగభూషణంనాయుడు, సలాంఖాన్,అమరనాథ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరసింహులు ఉన్నారు.

శంఖారావం సభ స్థల పరిశీలన

మడకశిర టౌన్ , ఫిబ్రవరి 28: శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మార్చి నెలలో మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, టీడీపీ నాయకులతో కలసి బుధవారం పట్టణ సమీపంలోని చీపులేటీ వద్ద సభ ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. నారా లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు సునీల్‌కుమార్ ముందుగా నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. మార్చి నెలలో పర్యటన ఉంటుందని, తేదీలు ఖరారు కావలసి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆదినారాయణ, అశ్వత్థ రామప్ప, టీడీపీ మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ఉగ్రనరసింహప్ప, కిష్టప్ప, ఈశ్వర్ సాగర్ తదితరులు ఉన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయ్: టీడీపీ

ధర్మవరం, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో అరాచకపాలన సృష్టిస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీరేగోపాలక్రిష్ణలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డులలో టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో 'బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లపాలనలో దౌర్జన్యాలు, కబ్జాలు, దాడులు, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించడానికి సరిపోయిందని, ఇకఅభివృద్ధి ఎక్కడ చేశారని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, రాళ్లపల్లిషరీఫ్, జిలకరశీన, గోసలశ్రీరాములు, కరెంటు ఆది, మాధవరెడ్డి, బత్తలగంగాధర్, మారుతీస్వామి, బీరేశీన, ఉస్మాన్, వీరయ్య, మాబు,బాబవలి, సోము, ఆనందరెడ్డి, జనసేన నాయకులు సూర్యనారాయణ, కొటికి రామాంజనేయులు పాల్గొన్నారు.



2వ వార్డులో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీనాయకులు

పథకాలు కేంద్రానివి.. ప్రచారం రాష్ట్రానిదా..?

● వైసీపీ ప్రభుత్వంపై బీజేపీ నాయకుల ఆగ్రహం

పుట్టపర్తి, ఫిబ్రవరి 28 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని అయితే రాష్ట్ర ప్రభుత్వం తమవేనని గొప్పలు చె ప్పుకుంటోందంటూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కొండమరాజు విమర్శించారు. 'ప్రజాపోరు' యాత్రలో భాగంగా బుధవారం మండల పరిధిలోని బొంతలపల్లి, వెంగలమ్మ చెరువు గ్రామాల్లో కేంద్ర పథకాలపై విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కరోనా సమయం నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి రేషన్‌కార్డులోని ఐదు మందికి ప్రతినెలా 5కేజీల ఉచిత బియ్యం, జలజీవన్ ద్వారా మంచినీటి కొళాయి, ప్రధానమంత్రి ఆవాస యోజనపథకం కింద గృహాలు మంజూరు చేసిందని, ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం కేంద్రం ఇస్తోందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం అమలుపై అక్కడ మహిళలు, పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఇచ్చిన ఇళ్లను రాష్ట్రం పూర్తి చేయలేదని అంగన్‌వాడీ సెంటర్లకు మంజూరుచేసిన మరుగుదొడ్ల నిధులను, పంచాయతీలకు ఇచ్చిన నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికుల రాష్ట్ర కన్వీనర్ హరిక్రిష్ణగౌడ్, కత్తి రాజారెడ్డి, సోకే రామాంజినేయులు, జ్యోతి ప్రసాద్, సురేంద్రబాబు, కళ్యాణ్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు: పీడీ

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 28: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పథకం కింద పనులు కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్ పేర్కొన్నారు. బుధ వారం మండలంలోని మిట్టపల్లి, మామిళ్లకుంట్లపల్లి పంచాయతీల పరిధిలోని ఫారంపాండ్ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి అధికారులతో మాట్లాడిన ఆయన జిల్లా వ్యాప్తంగా 31వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారని, వాటి సంఖ్యను రెట్టింపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయనతోపాటు ఉపాధి ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఎపీఓ సుధాకర్, ఎపీడీ సహాయకులు శివప్రతాప్ రెడ్డి, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, చంద్రారెడ్డి, రాజేంద్రయాదవ్, హనుమంతురెడ్డి, శివప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.



ఉపాధి అధికారులకు సూచనలిస్తున్న డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్

ఈత వనాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 28: జిల్లాలోని రొద్దం మండలంలో ఈతవనాన్ని తొలగించి నిప్పుపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారి సహదేవ్‌కు సీపీఎం నాయకులు ఇంతియాజ్ వినతిపత్రం బుధవారం అందజేశారు. రొద్దం మండలం ఆర్‌లోచర్ల గ్రామ రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 60-2లో 201 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈతవనాన్ని వైసీపీ నాయకులు అన్యాక్రాంతం చేసి వనాన్ని ధ్వంసం చేసి నిప్పుపెట్టారన్నారు. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుని గీత కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలని కోరారు. ఈత వనాన్ని నమ్ముకుని 500కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వీరు రెండు మూడు తరాలుగా వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ఈఎస్ వెంకటేశ్, వ్యవసాయం కార్మికసంఘం జిల్లా ప్రదానకార్యదర్శి పెద్దన్న, కార్మిక సంఘం నాయకులు రామకృష్ణప్ప పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పంటకోత ప్రయోగాలు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 28: మండలంలోని మర్రికొమ్మెదిన్నె తదితర గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు వేరుశనగ పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. రైతు ఉత్తారెడ్డి, రైతు లక్ష్మమ్మ పొలాల్లో పంటకోత ప్రయోగాలు చేశారు. ఏఓ లోకేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎకరాకు సరాసరి 1,680 కేజీల దిగుబడి వస్తుందన్నారు. ఆయనతోపాటు ఆర్బీకే సిబ్బంది ప్రత్యూష్, సున్నుబాషా, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు తప్పనిసరి: ఆర్డీవో

తనకల్లు, ఫిబ్రవరి 28: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు లోపిస్తే సబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆర్డీఓ వంశీకృష్ణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చిన్నరామన్నగారిపల్లి, ఈతోడు, రెడ్డివారిపల్లి, ముండ్లవారిపల్లి, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, అన్ని గదుల్లోను ఫ్యాన్ ఏర్పాటు చేయాలని, ఏమైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఆయనతోపాటు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎఎస్ఐ నరసింహులు, రెవిన్యూ సిబ్బంది, పోలీసులున్నారు.

పంటరుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోండి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి28: మండలంలోని గొట్లూరు సొసైటీ బ్యాంకులో పంటరుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకు సీఈఓ నారాయణస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు మార్చినెల 30వ తేదిలోపు వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యువల్ చేసుకుంటే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. బ్యాంకు రికార్డులన్నీ కంప్యూటరీకరణ చేస్తున్నామని కావున రైతులందరూ తప్పకుండా వన్‌బీ, అడంగల్, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు బ్యాంకులో అందజేయాలని సూచించారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం

ముదిగుబ్బ, ఫిబ్రవరి28: మండల కేంద్రంలోని ఆనంద్ లేడీస్ టైలరింగ్ షాప్‌లో బుధవారం అంతర్జాతీయ టైలరింగ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు, మనిషిని అందంగా తీర్చిదిద్దే పని బట్టలు కుట్టే టైలర్ చేస్తాడని, టైలర్‌గా జీవించడం గర్వకారణమన్నారు. లేడీస్ టైలర్ ఆనంద్, విశాలమ్మ, మహాలక్ష్మీ, గౌతమి, భార్గవి, చందన, కళ్యాయమ్మ, మౌనిక, పద్మిని పాల్గొన్నారు.



కొత్తచెరువులో ప్రతిభ చాటిన విద్యార్థికి బహుమతిని అందిస్తున్న డీఈఓ మీనాక్షి



ధర్మవరం కాకతీయ విద్యానికేతన్‌లో తయారుచేసిన నమూనాలతో విద్యార్థులు



గాండ్లపెంటలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ క్రిష్ణానాయక్



ఓడీసీలో నీటి కాలుష్య నివారణ ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ



కదిరి దత్త పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న కరస్పాండెంట్

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవైట్ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు చేపట్టిన సైన్స్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రోబోటిక్ ప్రదర్శనలు, అంతరిక్ష రంగంపై విద్యార్థులు ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం ఏ రంగంలో చూసిన సైన్స్ కీలకంగా మారిందని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌ను పరిశీలించిన డీఈఓ ప్రస్తుత వ్యవసాయం, వైద్య, ఆరోగ్యంలో సైన్స్‌లో ఎంతో కీలకంగా మారిందన్నారు. పలు పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ చాటి న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో పాల్గొంటారని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



నమూనాతో కదిరి కేఎల్ఎన్ పాఠశాల విద్యార్థులు



లయోలా పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్



ముదిగుబ్బ విశ్వభారతి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు



ధర్మవరం బ్రిలియంట్ పాఠశాలలో విన్యాసాన్ని ప్రదర్శిస్తున్న జేవీవీ జిల్లా నాయకుడు డాక్టర్ ఆదిశేషు

మంత్రి ప్రోద్బలంతోనే భూ ఆక్రమణ

టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత

రొద్దం, ఫిబ్రవరి 28: మంత్రి ఉష ప్రోద్బలంతోనే మండలంలోని కంచిసముద్రం గ్రామంలో ఈతచెట్లను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి భూకబ్జా చేశారని టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామం చెరువులో వైసీపీ కార్యకర్తలు ఈతచెట్లు తొలగించి ఆక్రమించిన నాలుగెకరాల భూమిని సవిత టీడీపీ స్థానిక నాయకులతో బుధవారం పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూకబ్జాలు అధికమయ్యాయని ఆమె విమర్శించారు. కల్లుగీత కార్మికులు ఎన్నోఏళ్లుగా పెంచుకుని, పొట్టనింపుకుంటున్న ఈతవనాన్ని తొలగించి, భూమిని కబ్జా చేసిన వైసీపీ కార్యకర్తలపై ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అనంతరం ఆమె బూచర్ల గ్రామంలో మాజీ సర్పంచ్ గంగన్న కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా... అతడి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం ఆర్థికసాయం అందించారు.


నల్లూరులో టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలతో సవిత

టీడీపీలోకి 13 కుటుంబాల చేరిక

మండలపరిధిలోని నల్లూరు ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన 13కుటుంబాల వారు సవిత సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. వారికి ఆమె టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో సముచిత స్థానం కల్పిస్తామని, అన్ని సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషిచేస్తానని సవిత హామీ ఇచ్చారు. టీడీపీలో చేరినవారిలో కర్రెన్న, తిమ్మపల్లి నరసప్ప, గుర్రం నాగరాజు, రామాంజినేయులు, అంజినప్ప, గుర్రం సుబ్బరాయుడు, కొలిమి శంకరప్ప, అంజనప్ప, సుబ్బరాయుడు, బైలాంజనేయులు, రెడ్డిపల్లి గంగప్ప, బండారుగారి నాగప్ప, కోనాపురం అర్జున్ తదితరులు ఉన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు మాధవనాయుడు, గోపాల్, నాగరాజు, తిరుపాల్‌నాయుడు, హనుమంతనాయుడు, కిష్టప్ప, బైలర్ ఆంజనేయులు, నరసింహులు, మాజీ సర్పంచ్ గంగన్న, కంచిసముద్రం మాజీ సర్పంచ్ హనుమంతరాయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సవితకు సన్మానం

పెనుకొండ టౌన్ : తన తండ్రి, మాజీ మంత్రి ఎస్ రామచంద్రారెడ్డి ఆశయాలతో రాజకీయాల్లో రాణిస్తున్న సవిత మంచికి, మానవత్వానికి నిదర్శనమని టీడీపీ నాయకులు పలువురు కొనియాడారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్దఎత్తున ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో గడచిన ఐదేళ్లలో గ్రామీణ, పట్టణాల్లో ఏ మాత్రం అభివృద్ధి జరగలే దని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ తప్పక విజయం సాధిస్తుం దన్నారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని, ఏ చిన్న సమస్య తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పంచాయతీల్లో పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు

గోరంట్ల, ఫిబ్రవరి 28: మండలంలోని 20 పంచాయతీలకు సంబంధించి విద్యుత్ బకాయిలు పెద్దఎత్తున చెల్లించాల్సి ఉందని సంబంధిత అధికారులతో ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ బుధవారం చర్చించారు. మండలపరిషత్ కార్యాలయానికి ఆయన వచ్చారు. మండలంలోని పంచాయతీల విద్యుత్ బకాయిలపై ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వివరించారు. ఈఓఆర్డీ సుధాకర్‌ను ఎంపీడీఓ పిలిపించి చర్చించారు. మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరా, వీధి దీపాలు, కార్యాలయాల నిర్వహణకు సంబంధించి 20 పంచాయతీల్లో రూ.3.66కోట్లు చెల్లించాల్సి ఉండగా, గోరంట్ల మేజర్ పంచాయతీ మాత్రమే రూ.1.36 కోట్లు చెల్లించాల్సి ఉందని ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. ఈమొత్తం 2023 మార్చి నుంచి 2024 జనవరి వరకు పదినెలల బకాయిగా పేర్కొన్నారు. ఇది కాకుండా పాత బకాయి మొత్తం కూడా అధికంగా ఉందన్నారు. పాత బకాయి మండల వ్యాప్తంగా రూ.18.18 కోట్లుకాగా, గోరంట్ల మేజర్ పంచాయతీ రూ.7.88 కోట్లు చెల్లించాల్సి ఉంద న్నారు. ప్రస్తుతం పదినెలల బకాయి వెంటనే చెల్లించేలా చర్యలు చేట్టాలని ఎంపీడీఓను కోరారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన


బిట్స్ కళాశాల బిల్డింగ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ బుధవారం పరిశీలించారు. బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వసతులను పరిశీలించారు. కౌంటింగ్‌కు అనుకూల పరిస్థితులపై ఆరాతీశారు. బిల్డింగ్ మ్యాప్‌ను, గదులను పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 28: ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కళాజాతా బృందం వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి, వ్యాధి సోకితె తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యాధిగ్రస్తులపై చిన్నచూపు చూడకూడదని, కొంత మంది చేయని తప్పులకు శిక్ష అనుభవిస్తుంటారని వివరించారు. కండోమ్ యొక్క ఉపయోగం తెలియజేశారు. ఎయిడ్స్ యాక్ట్ 2017 ప్రకారం మందులు అందుబాటులో ఉన్న విషయం, టోల్‌ఫ్రీనెంబర్ 1097 తదితర విషయాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో చైతన్య, ఓఆర్‌డబ్ల్యూఎస్ భారతి, ముంతాజ్, జయమ్మ, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సవిత పరామర్శ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చలపతి అనారోగ్యంతో మృతిచెందాడు. అదేవిధంగా పెనుకొండ మండలం రాంపురం గ్రామానికి చెందిన ఆనంద్ కుమారుడు అజయ్ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత ఆ గ్రామాలకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. భౌతిక కాయాలను దర్శించి పూలమాలలువేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

సీఐటీయూ సెక్టార్ అధ్యక్షురాలిగా పద్మ

రొద్దం, ఫిబ్రవరి 28 : సీఐటీయూ మండలంలోని తురకలాపట్నం సెక్టార్ అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. రొద్దం మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో బుధవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా పద్మ, కార్యదర్శిగా సరస్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. అంగనవాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, అంగనవాడీ వర్కర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 28: మండలంలోని 544-ఈ జాతీయ రహదారిపై విరాట్ ప్యాలెస్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన జగదీష్ (14) హిందూపురం ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. బాలుడి తాత ఆదినారాయణప్ప ప్రమా దం జరిగిన కొంత సేపటికే చిలమత్తూరు ప్రభుత్వా సుపత్రిలో మృతిచెందిన విషయం విదితమే. అయితే మృతుడు ఆదినారాయణప్ప భార్య చెన్నమ్మ తీవ్ర గాయా లతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మృతిచెందిన బాలుడు జగదీష్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఒకే కుటుంబంలో తాత, మనవడు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

నాలుగు గడ్డివాముల దగ్ధం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 28: పరిగి మండలం నేతులపల్లిలో బుధవారం నిప్పంటుకుని నాలుగు గడ్డివాములు దగ్ధమయ్యాయి. సమీపంలో చెత్తాచెదారానికి నిప్పంటించడంతో నిప్పు రవ్వలు గాలికి ఎగిసివచ్చి గడ్డివాములపై పడినట్లు స్థానికులు తెలిపారు. దీంతో పక్కపక్కనే ఉన్న నాలుగు గడ్డివాములు పూర్తిగా దగ్ధమైపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకునేలోపే వాములు కాలి పోయినట్లు సమాచారం. దీంతో చిత్తన్నగారి అడివన్న, కాటప్పగారి లక్ష్మణ్ణ, సురేష్ లక్ష్మణకు దాదాపుగా మొత్తం రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు స్థానికులు మాట్లాడుకుంటున్నారు. అయితే పసువుల కోసం ఉంచిన గడ్డి వాములు దగ్ధమయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

సీపీఐ నాయకుల ఆందోళన


మరవకొత్తపల్లి వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 28: మండలంలోని మరువకొత్తపల్లి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కనిశెట్టిపల్లి వినోద్, నాయకులు గోవిందరెడ్డి, బాలచంద్ర, నాగిరెడ్డి, శ్రీనివాసులు, గణేష్, రాము తదితరులు స్థానికులతో కలిసి 544-ఈ జాతీయ రహదారిపై బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మరవకొత్తపల్లి విరాట్ ప్యాలెస్ వద్ద జనసంచారం ఎక్కువగా ఉంటుందని, శుభకార్యాలకు జనం అధికంగా వచ్చి వెళ్తుంటారని అన్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్ బ్రేకులు ఏర్పాటుచేయాలన్నారు. చిలమత్తూరుకు చెందిన వారికి మంగళవారం రాత్రి ఇదే ప్రాంతంలో ప్రమాదం జరగడంతో ఒకే కుటుంబంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు రోడ్డుపై పైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసుల జోక్యంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

శిలాఫలకంలో పేర్లకు కూడా నోచుకోలేమా?

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

పెనుకొండ, ఫిబ్రవరి 28: స్థానిక దర్గా సర్కిల్‌లో కొత్తగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌కు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకంపై కౌన్సిలర్ల పేర్లులేకపోవడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సభ్యుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ... కష్టపడేది కౌన్సిలర్లు అయితే శిలాఫలకంలో కనీసం వారి పేర్లు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ఇంటి వద్దకు చెత్త సేకరణకు ట్రాక్టర్లు వస్తున్నప్పటికీ ప్రజలు, దుకాణదారులు మాత్రం చెత్తను రోడ్లపై వేస్తున్నారన్నారు. అలాంటి వారికి నోటీసులు జారీచేసి జరిమానా విధించాలన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. అందుకు కమిషనర్ వంశీకృష్ణ సమాధానమిస్తూ పట్టణంలో రూ.1.10కోట్లతో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. త్వరలో పనులు పూర్తిచేసి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద త్వరలో పూలమార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ సునీల్‌కుమార్, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సప్తగిరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రధాని పెద్దపీట: బీజేపీ

మడకశిర టౌన్, ఫిబ్రవరి 28: దేశంలో రైతుల సంక్షేమానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పెద్దపీట వేశారని, మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ బోర్డు మెంబర్ తలపుల గంగాధర్, కిసాన్‌మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆవరణంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పదికోట్ల మంది రైతులకు రూ.21వేల కోట్లను 16వ విడత కిసాన్ సమ్మాన్ నిధి రైతుల ఖాతాలలో జమచేశారన్నారు. ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 40వేల మంది రైతుల ఖాతాల్లో రూ.8.04కోట్లు జమ చేశారన్నారు. నరేంద్రమోదీతోనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలో కూడా హైవేలకు లింక్‌రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. అదేవిధంగా గరీబ్ కల్యాణ్ యోజన పథకం, ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ యోజన పథకం వంటి కార్యక్రమాలు ఎన్నో చేపట్టి దేశ ప్రజల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఈ సమావేశంలో మడకశిర నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీకే కార్యాలయానికి అభిమానుల తాకిడి


బీకే కార్యాలయానికి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు

పెనుకొండ, ఫిబ్రవరి 28 : పట్టణంలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి కార్యాలయానికి రోజు రోజుకు అభిమానుల తాకిడి కొనసాగుతోంది. టీడీపీ పెనుకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ బీకే పార్థసారథికి రాకపోవడం, ఆయనకు హిందూపురం లేదా అనంతపురం పార్లమెంట్ టికెట్ ఇస్తారని వదంతులు రావడంతో ఆయన కార్యాలయానికి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున తరలి వస్తున్నారు. బీకే పార్థసారథికి తమ సంపూర్ణమద్దతు ఉంటుందని, ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే నడుస్తామని పేర్కొన్నారు.

'బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి'

గుడిబండ, ఫిబ్రవరి 28 : విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ పేర్కొన్నారు. గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రిజర్వ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాంక్ నెట్‌బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుడిబండ కెనరాబ్యాంక్ మేనేజర్ లోక్‌నాథ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు గోవిందప్ప, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పురంలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు


జ్ఞానజ్యోతి పాఠశాలలో నమూనాల ప్రదర్శన

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

హిందూపురం/ హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యా ర్థులు వివిధ వైజ్ఞానిక నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఏఓ నవీన్, అకడమిక్ పరమేష్, శివన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జ్ఞానజ్యోతి పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఎంఈఓ గంగప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ బాలకృష్ణ, హెచ్‌ఎం సత్యకుమార్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షు డు పాంచజన్య శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

పెనుకొండ/గోరంట్ల: స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ హాజరయ్యారు. స్థానిక అలాగే ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో హెచ్‌ఎం మంజువాణి అధ్యక్షతన, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ కేశవులు పాల్గొన్నారు. గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామంలో ఉన్న శ్రీసాయిప్రతిభ పాఠశాలలో సైన్సుడేను ఘనంగా నిర్వ హించారు. ప్రధానోపాధ్యాయుడు అల్లాబక్ష, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలోని ఆర్ అనంతపురం ఉన్నత పాఠశాలలో సైన్స్‌డేను ఘనంగా జరుపుకొన్నారు. ఎంఈఓ-2 నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు మహాలింగప్ప, దత్తాత్రేయ, విజయభార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు. రొళ్ల మండల కేంద్రంలోని బాలాజీ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.


పెనుకొండ ప్రగతి గ్లోబుల్‌జెన్ పాఠశాలలో...


పాలసముద్రంలో విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన నమూనాలు


ఆర్ అనంతపురంలోని పాఠశాలలో...


రొళ్ల బాలాజీ పాఠశాలలో...

శంఖారావం సభాస్థలం పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

మడకశిర టౌన్ , ఫిబ్రవరి 28: శంఖారావం కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మార్చి నెలలో మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, టీడీపీ నాయకులతో కలసి బుధవారం పట్టణ సమీపంలోని చీపులేటీ వద్ద సభ ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. నారా లోకేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు సునీల్‌కుమార్ ముందుగా నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. మార్చి నెలలో పర్యటన ఉంటుందని, తేదీలు ఖరారు కావలసి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, టీడీపీ మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ఉగ్రనరసింహప్ప, కిష్టప్ప, ఈశ్వర్‌సాగర్ తదితరులు ఉన్నారు.

కళాశాలల్లో వసతుల పరిశీలన


నారాయణ కళాశాలలో వసతులపై ఆరాతీస్తున్న రాష్ట్ర పరిశీలకుడు మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి28: ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు మార్చి 1వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఇంటర్ మీడియట్ పరీక్షల రాష్ట్ర పరిశీలకులు మదన్‌మోహన్ రెడ్డి, ఆర్‌ఐఓ సురేష్, బీఈసీ లక్ష్మీకాంత్‌రెడ్డి పట్టణంలోని పలు కళాశాలలను పరిశీలించారు. ముఖ్యంగా కళాశాలల్లో సీసీ కెమరాలు ఉన్నాయా? అవి ఎలా పనిచేస్తున్నాయి? రికార్డు చేస్తున్నాయా? తదితర విషయాలను పరిశీ లించారు. అదే విధంగా విద్యార్థులకు అనుకూల వాతావరణం, గాలి వెలుతురు, తాగునీటి సౌకర్యం, బెంచీలు తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా ఉండేలా చూడాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నా రాయణ కళాశాలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హిందూపురంలోని ప్రభుత్వ బాలికల కళాశాల, నారాయణ, బాలాజీ, బాలయేసు, సువర్ణభారతి, ఎల్ఆర్‌జీ, ఎస్‌డీజీఎస్, ఏపీఆర్‌జెసీ, సప్తగిరి కళాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ తొమ్మిది కేంద్రాలలో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియను నిలిపేయండి

ఎంపీడీఓకు గ్రామ సచివాలయ ఉద్యోగుల వినతి


ఎంపీడీఓ వాసుదేవగుప్తకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

లేపాక్షి, ఫిబ్రవరి 28 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ బదిలీ ప్రక్రియను వెంటనే నిలుపుదల చేయాలని మండల సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నికల ముందు అధికార ప్రభుత్వం తీసుకొచ్చిన రేషనలైజేషన్ బదిలీ ప్రక్రియ ద్వారా సచివాలయ ఉద్యోగులు పూర్తిగా నష్టపోతారన్నారు. పిల్లల చదువులు, ఇతర సమస్యలతో ఉన్నవారు ఈ ప్రక్రియ ద్వారా నష్టపోతామని ఎన్నికలు ముగిసిన తరువాత జనరల్ బదిలీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేడియో ప్రోగ్రాం రికార్డింగ్‌పై అవగాహన


విద్యార్థులు పాడిన పాటలను రికార్డ్ చేస్తున్న ఆకాశవాణి సిబ్బంది

అగళి, ఫిబ్రవరి 28 : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అనంతపురం జిల్లా ఆకాశవాణి సిబ్బంది హేమంత్, రాజు, నాగేశ్వర్‌రెడ్డి విద్యార్థులకు రేడియో ప్రోగ్రాం రికార్డింగ్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన పాటలు, గేయాలను మార్చి 17వ తేదీ సాయంత్రం 5.30లకు రేడియోలో ప్రసారం చేయను న్నట్లు వారు తెలిపారు. బాల గేయాలు, ఉపన్యాసాలను న్యూస్‌ఆన్ ఎయిర్ ప్రసార భారతి , ఏటీపీ ద్వారా వినవచ్చని తెలిపారు. అదేవిదంగా తమ స్వరాలు రేడియోలో ప్రసారం కావ డం తమకెంతో సంతోషాన్ని ఇస్తుందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదరాజులు, ఉపాధ్యాయులు ఉమేష్, నాగేంద్ర, బాబు, జీవన్, నాగార్జున, భరత్ కుమార్, శంకర్ నారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 28 : మండలంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టినట్లు పీఓ కాంతారావు తెలిపారు. పాఠ శాల పరిసర ప్రాంతాల్లో ఏపుగా పెరిగిన కంపచెట్లను బుధవారం తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు ఇందిరా, ఎన్ఎస్ఎస్ పీఓ రంగ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో పురం విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ, ఫిబ్రవరి 28 : సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ పోటీల్లో స్థానిక శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు 14 మంది బంగారు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వారికి బుధవారం సర్టిఫికెట్లు, మెడళ్లు అందజేసినట్లు తెలిపారు.